సాక్షి
రంగారెడ్డి
శనివారం ¦ 27 ¦ మే ¦ 2023

30 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎండీహెచ్‌ఎం(మాస్టర్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువును రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 30 వరకు పొడిగించారు. ఓయూ పరిధిలోని అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాస్పిటల్ అడ్మిస్ట్రేషన్, డక్కన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కొనసాగుతున్న ఈ కోర్సులో ప్రవేశానికి ఏదేనీ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు.

స్పెషల్ రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ తెలిపారు. హైదరాబాద్‌-కటక్ (07165/07166) స్పెషల్ ట్రైన్ ఈ నెల 30, జూన్ 6, 13, 20,27 తేదీల్లో రాత్రి 8.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. తిరుగు పయనంలో ఈ నెల 31, జూన్ 7, 14, 21, 28 తేదీల్లో రాత్రి 10.30కు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9కి హైదరాబాద్ చేరుకుంటుంది.

29న ప్రజావాణి రద్దు

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక ఏర్పాట్లు చేస్తున్నందున ఈ నెల 29న సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ హరీశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే సోమవారం నుంచి ప్రజలకు ఇబ్బంది లేకుండా యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. జిల్లావాసులు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

మృతుడి గుర్తింపు

మృతదేహాన్ని డ్రమ్ములో కుక్కి చెరువులో పడేసిన ఘటనలో పురోగతి



మృతుడు, పూరన్‌సింగ్ (ఫైల్)

పహాడీషరీఫ్: మృతదేహాన్ని డ్రమ్ములో కుక్కి చెరువులో పడేసిన ఘటనలో పహాడీషరీఫ్ పోలీసులు పురోగతి సాధించారు. మృతుడు చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో అదృశ్యమైన పూరన్ సింగ్‌గా గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 25న సాయంత్రం చెరువులో మృతదేహం లభ్యం కావడంతో పరిసర పోలీస్‌స్టేషన్లలో అదృశ్యమైన కేసులను పరిశీలించారు. చాంద్రాయణగుట్ట పరిధిలోని కేసుగా పోలీసులు నిర్ధారించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దీన్ దయాళ్ కుమారుడు పూరన్‌సింగ్ (30) హైదరాబాద్‌కు వలస వచ్చి చాంద్రాయణగుట్టలోని బండ్లగూడ పటేల్‌నగర్‌లో పానీపూరి బండి నడుపుకొంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 22న రాత్రి 10 గంటలకు బార్కాస్‌లోని వివాహానికి హాజరవుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ రావడం.. స్థానికంగా గాలించినా ఫలితం లేకపోవడంతో అతని భార్య మమతా సింగ్ 23న రాత్రి 7 గంటలకు చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో మృతుడి వివరాలు తెలియరావడంతో పూరన్‌సింగ్‌కు ఉన్న వివేధాల విషయమై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా బార్కాస్ తీసుకెళ్లిన వ్యక్తిని గుర్తించి కేసును ఛేదించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఉత్సవాల్లో దివ్యాంగులకు స్థానం కల్పించాలి

ఇబ్రహీంపట్నం: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో దివ్యాంగులను భాగస్వాములను చేసి, ఒకరోజు ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించాలని ఎన్‌పీఆర్డీ (దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక)జిల్లా అధ్యక్షుడు భుజంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నివర్గాలు, సామాజిక తరగతులు, ప్రభుత్వ పథకాలపై 21 రోజులు 21 రకాల కార్యక్రమాలతో వేడుకలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో 12 శాతం ఉన్న దివ్యాంగులకు దశాబ్ది ఉత్సవాల్లో స్థానం దక్కకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. 2016 ఆర్‌పీడీ చట్ట ప్రకారం అధికారికంగా నిర్వహించే ఉత్సవాల్లో దివ్యాంగులను భాగస్వాములను చేయాలని ఉన్నప్పటికీ, దశాబ్ది ఉత్సవాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన కరపత్రంలో తమ ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరమన్నారు.

పాలిసెట్‌లో మెరిసిన నగర విద్యార్థులు



3వ ర్యాంకు సాధించిన ప్రణీత్

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీఎస్ పాలీసెట్‌-2023 ప్రవేశ పరీక్షలో గ్రేటర్ విద్యార్థులు సత్తా చాటారు. టాప్‌-15 ఎంపీసీ విభాగంలో మీర్‌పేట్‌కు చెందిన పి.ప్రణీత్ 118 మార్కులతో మూడో ర్యాంక్ సాధించాడు. మరో తొమ్మిది మందికి 100లోపు ర్యాంకులు లభించాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలో సీహెచ్ లక్ష్మి హరిణి 113.5తో 16 ర్యాంక్, మాధురి 111 మార్కులతో 33వ ర్యాంక్, రితిక్ 110.5 మార్కులతో 35వ ర్యాంక్ సాధించారు. మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాకు చెందిన సాయిరాధ లాస్య ప్రియ 112 మార్కులతో 25వ ర్యాంక్, పి.సంజన 110 మార్కులతో 42వ ర్యాంక్, చింతల రిత్విక్ 109.5 మార్కులతో 48వ ర్యాంక్ సాధించగా, రంగారెడ్డి జిల్లా పరిధిలో టి.అశిష్ 110 మార్కులతో 44వ ర్యాంక్, వరాల శ్రీనిధి 109 మార్కులతో 57వ ర్యాంక్, కందగట్ల మహిత 107.5 మార్కులతో 83వ ర్యాంక్ సాధించారు.

ప్రణీత్ ప్రతిభ

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధి ద్వారకామయినగర్ కాలనీకి చెందిన ప్రొద్దుటూరి ప్రణీత్ రాష్ట్రస్థాయి ఎంపీసీ స్ట్రీమ్ 3వ ర్యాంకు సాధించాడు. తండ్రి కేదార్‌నాథ్ ప్రైవేటు ఉద్యోగి కాగా, తల్లి హౌస్‌వైఫ్. ప్రణీత్ కర్మన్‌ఘాట్‌లోని స్లేట్ స్కూల్‌లో 10వ తరగతి చదివాడు. ఈ సందర్భంగా ప్రణీత్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు రావడం సంతోషంగా ఉందని, భవిష్యత్తులో పరిశోధనలు (రీసెర్చ్ సెంటర్స్) చేయాలని ఉందని తెలిపాడు.

29న పాలక మండలి భేటీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 29న పాలక మండలి (ఈసీ) సమావేశం జరగనుంది. పలు అంశాలతో పాటు వివిధ అభివృద్ధి పనులపై చర్చ జరిగే అవకాశం ఉంది. రిటైర్డ్ అధ్యాపకులు ప్రొ.అన్సారీ అంశం ఈసారి ఈసీలో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

సమావేశంలో పాల్గొన్న మంత్రులు తలసాని, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు





దశదిశలా బోన వైభవం

బోనాలు అదిరేలా



- ఉత్సవ నిర్వహణకు రూ.15 కోట్లు
- 26 దేవాలయాలకు ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు
- అంబారీ ఊరేగింపునకు ఏనుగును సమకూర్చనున్న ప్రభుత్వం
- బోనాల ఏర్పాట్లపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సమీక్ష
- హాజరైన మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లారెడ్డి, సీఎస్, డీజీపీ

బోనాల తేదీలు ఇలా...
- జూన్ 22న గోల్కొండ జగదాంబికాకు తొలిబోనం
- జులై 9న సికింద్రాబాద్ మహంకాళి
- జులై 16న ఓల్డ్ సిటీ బోనాలు..

26 దేవాలయాలకు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు..

సనత్‌నగర్: తెలంగాణ సంస్కృతిని ప్రపంచం నలుదిశలా చాటిచెప్పేలా ఆషాఢ బోనాల ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. జూన్ 22న ప్రారంభం కానున్న ఆషాఢ బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం బేగంపేటలోని హరితాప్లాజాలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ బోనాల పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించారని, ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు.

ఉత్సవాల నిర్వహణకు రూ.15 కోట్లు

- బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జూన్ 22న గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. జులై 9న సికింద్రాబాద్ మహంకాళి బోనాలు, 10న రంగం, 16న ఓల్డ్ సిటీ బోనాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అనేక ప్రైవేటు దేవాలయాలకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. బోనాల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో వసతులు, ఏర్పాట్ల కోసం సుమారు రూ.200 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.
- ఉత్సవాలకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు.
- విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం జీహెచ్‌ఎంసీ అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమిస్తామన్నారు.
- ఊరేగింపు నిర్వహించే రహదారులు, ఆలయాలకు వెళ్ళే రహదారుల్లో అవసరమైన మరమ్మ తులు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు అధికారులు చర్య లు తీసుకోవాలని ఆదేశించారు.
- శాంతిభద్రతల పర్యవేక్షణకు ఇతర జిల్లాల నుంచి అదనపు పోలీసు సిబ్బంది సేవలను ఉపయోగించుకోవడం జరుగుతుందని, అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయనున్నట్లు వివరించారు. స్వచ్ఛందంగా సేవలు అందించే వాలంటీర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులను అందజేస్తామని తెలిపారు.

ఎస్టీపీలపై ఫోకస్

జంట జలాశయాల పరిరక్షణకు 22 ఎస్టీపీలు



ఉస్మాన్ సాగర్



హిమాయత్‌సాగర్

- ఇప్పటికే 4 ఎస్టీపీల నిర్మాణానికి రూ.82.23 కోట్లు
- జీఓ 111 రద్దుతో మిగతావాటికి కార్యాచరణ
- జలాశయాల్లోకి మురుగునీరు చేరకుండా చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: జీఓ 111 ఎత్తివేత నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి కార్యాచరణను వేగవంతం చేసింది. జంట జలాశయాల పరిరక్షణపైన దృష్టి సారించింది. జీఓ ఎత్తివేత వల్ల జలాశయాలు దెబ్బతింటాయని ఆందోళనలు వ్యక్తమవుతున్న దృష్ట్యా మురుగుశుద్ధి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. జీఓ ఎత్తివేతకు ముందే గత నెలలోనే జలాశయాల పరిరక్షణ కోసం 4 చోట్ల ఎస్టీపీల నిర్మాణానికి ప్రభుత్వం రూ.82.23 కోట్లు విడుదల చేసింది. మిగతా చోట్ల ఎస్టీపీల నిర్మాణంపైన అధికారులు తాజాగా దృష్టి సారించారు. హెచ్‌ఎండీఏ నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణ అనుమతులను ఇవ్వనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. జీవో 111 పరిధిలోని 84 గ్రామాల కోసం ప్రత్యేకంగా మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించేందుకు ఇప్పట్లో అవకాశం లేకపోవడంతో ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధిలో వివిధ రకాల భవనాలు, పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలకు అనుమతులను ఇచ్చేందుకు అనుసరిస్తున్న ప్రమాణాలనే 111 జీఓ పరిధిలోనూ అమలు చేయనున్నారు. ఈ క్రమంలోనే జలాశయాల్లోకి మురుగునీరు, కలుషిత జలాలు వచ్చి చేరకుండా వాటికి ఎగువన 22 చోట్ల సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తారు.

పక్కాగా ప్రణాళికలు...

జీఓ ఎత్తివేత వల్ల ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలు మరో హుస్సేన్‌సాగర్‌లా మారుతాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ అస్తిత్వాలు దెబ్బతినకుండా, ఏమాత్రం మురుగునీరు చేరకుండా ఈ ఎస్టీపీలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. జీఓ 111 పరిధిలో 1.32 లక్షల ఎకరాలు అందుబాటులో ఉంది. అందులో మాస్టర్ డ్రైనేజీ ప్లాన్, మాస్టర్ సీవరేజ్ ప్లాన్‌లు అమలు చేయనున్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో జలాశయాల ఎగువన 945.51 మిలియన్ గ్యాలన్ల సామర్థ్యంతో 358 ఎకరాల్లో 22 వరకు రానున్నాయి. అందులో ఉస్మానసాగర్ ఎగువన 337.73 మిలియన్ గ్యాలన్ల సామర్థ్యంతో 129 ఎకరాల్లో 9 ఎస్టీపీలను, హిమాయత్‌సాగర్ ఎగువన 607.78 మిలియన గ్యాలన్ల సామర్థ్యంతో 229 ఎకరాల్లో 13 ఎస్టీపీలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు. ఈ దిశగా జీఓ 111 ఏరియాలో 22 ఎస్టీపీల నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించి ఇవ్వాలని ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. భూసేకరణ పూర్తయితే జలమండలి ఎస్టీపీల నిర్మాణ పనులను చేపట్టనుంది. ఎస్టీపీలను ఎక్కడికక్కడ నిర్మించినా వాటిని ఒకదానికొకటి పూర్తిగా అనుసంధానం చేయనున్నారు. ఆయా ఎస్టీపీలలో శుద్ధి చేసిన నీటిని జంట జలాశయాల్లో చేరకుండా చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం జంట జలాయాలకు ఇరువైపులా ప్రత్యేకంగా వరదకాల్వలను నిర్మాణం చేయనున్నారు. ఎగువ ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీరంతా వరద కాల్వలోకి చేరనుంది. వరద కాల్వల నుంచి శుద్ధి చేసిన నీరు నేరుగా మూసీనదిలో కలుపుతారు. ఎస్టీపీల నుంచి ఒక్క చుక్క మురుగునీరు బయటకు రాకుండా, జంట జలాశయాల్లోకి చేరకుండా చేస్తారు.

ఉస్మాన్‌సాగర్ ఎగువన ఎస్టీపీలు వచ్చే ప్రాంతం

ప్రాంతం	ఎస్టీపీ సామర్థ్యం (ఎంజీడీ)	భూమి ఎకరాల్లో
ఖానాపూర్	70.10	26
జన్వాడ1	36.27	14
జన్వాడ2	20.60	8
బుల్కాపూర్	6.74	3
టంగుటూరు	20.68	8
చిన్నమంగళారం	47.48	18
రెడ్డిపల్లె	54.56	21
చిలుకూరు	25.67	10
హిమాయత్‌సాగర్	55.52	21
మొత్తం	337.73	129

హిమాయత్‌సాగర్ ఎగువన ఎస్టీపీలు వచ్చే ప్రాంతాలు

ప్రాంతం	ఎస్టీపీ సామర్థ్యం (ఎంజీడీ)	భూమి ఎకరాల్లో
అజీజ్‌నగర్	12.28	5
బంగాలిగూడ	16.38	6
నాగిరెడ్డిగూడ	12.15	5
అమ్డాపూర్	78.06	29
శ్రీరాంనగర్	7.62	3
వెంకటపూర్	27.05	10
సోలిపేట్	2.69	1
రామనుజపూర్	9.59	4
మల్కారం	4.01	2
సుల్తానపల్లె	46.16	17
నర్కుడ	53.97	20
కవగూడ	244.40	92
కొత్వాల్‌గూడ	93.43	35
మొత్తం	607.78	229

పుస్తక పఠనంతో జ్ఞాపక శక్తి మెరుగు



రాజావరప్రసాద్‌ను సన్మానించిన గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

- రాష్ట్ర సహకార సంఘం ఛైర్మన్ రాజావరప్రసాద్

షాద్‌నగర్: పుస్తక పఠనంతో జ్ఞాపక శక్తి పెరుగుతుందని రాష్ట్ర సహకార సంఘం ఛైర్మన్ రాజా వరప్రసాద్ అన్నారు. షాద్‌నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన రాజావరప్రసాద్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మనిషిలోని అజ్ఞానం అనేది చదువుతోనే తొలుగుతుందని అన్నారు. పుస్తకాలు చదివిన వారు మనుషుల వ్యక్తిత్వాలు, సమాజం, వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు జీవితాన్ని బాగా అర్థం చేసుకుంటారన్నారు. ప్రతి రోజు అందరూ కొంత సమయాన్ని పుస్తకాలు చదవడం కోసం కేటాయించాలన్నారు. ప్రజలను విజ్ఞాన వంతులను చేయడంలో గ్రంథాలయాలు కీలక భూమిక పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పాఠకుడిగా సభ్యత్వాన్ని తీసుకోవడంతో పాటు గ్రంథాలయ అభివృద్ధి కోసం రూ.21వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ లక్ష్మీ నర్సింహారెడ్డి, సభ్యులు ఆర్ల యాదయ్య, అందె మహేశ్వర్, సురేందర్, అరుణ, అందె జంగరాజు, సలీం, కుమార్, గోపాల్, ఆంజనేయులు, నవీన్, అజహర్, సూర్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన చేపట్టాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య వినతి

కాచిగూడ: జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని, దేశ జనాభాలో 75 కోట్ల మంది ఉన్న బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కృష్ణయ్య నేతృత్వంలోని బీసీ సంఘం నేతలు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా బీసీల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా దేశంలో 56 శాతం జనాభా ఉన్న బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమాన వాటా ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. పులులు, జంతువులకు లెక్కలున్నాయని, కానీ బీసీలకు మాత్రం లెక్కలు లేవన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకు అన్నీ రంగాలలో సమాన వాటా ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందని, బీసీ డిమాండ్లు న్యాయమైనవేనని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడానికి, బీసీల బడ్జెట్‌ను పెంచడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆధ్యాత్మిక క్షేత్రంగా మహేశ్వరం

- ఆలయాలను తీర్చిదిద్దుతాం
- మంత్రి సబితారెడ్డి



40 అడుగుల మహేశ్వరుడి విగ్రహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరాన్ని ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కేసీ తండా కొత్వాల్ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన 40 అడుగుల భారీ మహేశ్వరుడి విగ్రహాన్ని శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 8 పురాతన ఆలయాల్లో ఒక్కో ఆలయ అభివృద్ధికి రూ.కోటి చొప్పున మొత్తం రూ.8 కోట్లు మంజూరు చేయించినట్టు తెలిపారు. మహేశ్వరంలో గడికోట, మెట్ల బావి, రాజరాజేశ్వర ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఉదయం ఇంద్రారెడ్డి ట్రస్టు చైర్మన్ కార్తీక్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి దంపతులు భారీ శివుడి విగ్రహాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునితా నాయక్, కేసీ తండా సర్పంచ్ జాటోత్ మోతిలాల్ నాయక్, జిల్లా రైతు కమిటీ సభ్యుడు కూన యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆనందం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలగవాయె!

నగరంలో పలు కాలనీలు, బస్తీల్లో అంధకారం
- నిత్యం వెయ్యికి పైగా ఫిర్యాదులు
- పేరుగొప్ప ఈఈఎస్‌ఎల్.. పనితీరు అధ్వానం
- చర్యలు తీసుకోని జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వీధిదీపాల నిర్వహణ దారుణంగా ఉంది. ఓవైపు పలు ప్రాంతాల్లోని దీపాలు వెలగక అంధకారంలో ఉండగా, మరోవైపు కొన్ని ప్రాంతాల్లో మిట్టమధ్యాహ్నం సైతం ఆరిపోకుండా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ ఖర్చు పెరుగుతోంది. గతంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలోనే వీధి దీపాల నిర్వహణ ఉండేది. దాదాపు ఐదేళ్లక్రితం వీధిదీపాల నిర్వహణను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఈఈఎస్‌ఎల్(ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్)కు అప్పగించింది. కాంట్రాక్టు మేరకు నెలకు జీహెచ్‌ఎంసీ రూ.7 కోట్లు ఈఈఎస్‌ఎల్‌కు చెల్లిస్తున్నా ప్రజలకు మాత్రం చీకట్లే మిగులుతున్నాయి. మొత్తం వీధి దీపాల్లో 98 శాతానికి తగ్గకుండా వెలగాలని ఒప్పందంలో ఉన్నప్పటికీ, అది అమలు కావడం లేదు. నగరంలోని కొన్ని సర్కిళ్లలో 50 శాతం వీధిదీపాలు వెలగడం లేవు. కొన్ని ప్రాంతాల్లో ఇది ఇంకా ఎక్కువే ఉంది. జీహెచ్‌ఎంసీ కాల్ సెంటర్‌తోపాటు వివిధ మాధ్యమాల ద్వారా ప్రతినిత్యం వేయికి పైగా ఫిర్యాదులందుతున్నాయి. అయినప్పటికీ, అటు ఈఈఎస్‌ఎల్‌కు కానీ, ఇటు జీహెచ్‌ఎంసీకి కానీ చీమకుట్టినట్లు కూడా లేదు.

చర్యల లేమి..

ఆటో టైమర్లతో చీకటిపడగానే ఆటోమేటిక్‌గా లైట్లు వెలుగుతాయని, తెల్లారగానే ఆరిపోతాయని పేర్కొన్నప్పటికీ, ఆటోమేటిక్ సిస్టం పనిచేయడం లేదు. చాలా ప్రాంతాల్లో మాన్యువల్‌గానే నిర్వహిస్తున్నారు. ఈఈఎస్‌ఎల్‌లో తగినంత మంది సిబ్బంది లేక అదీ సవ్యంగా జరగడం లేదని తెలుస్తోంది. ఈఈఎస్‌ఎల్‌కు నిర్వహణను అప్పగించడంతో జీహెచ్‌ఎంసీలోని విద్యుత్‌విభాగంలో పనిచేసే సిబ్బందిని ఇతర విభాగాలకు తరలించారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసేవారు లేరు. పాడైన వైర్లు,బల్బులను సకాలంలో బాగు చేయడం లేదు.నగరంలో వీధిదీపాల పరిస్థితి మొత్తం అధ్వాన్నంగా మారినా,కాంట్రాక్టు ఒప్పందం మేరకు పనులు జరగకున్నా జీహెచ్‌ఎంసీ తగిన చర్యలు తీసుకోవడంలేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

జీహెచ్‌ఎంసీ డ్యాష్‌బోర్డు మేరకు శుక్రవారం (26 మే) రాత్రి 7.30 గంటలకు.. వీధి దీపాలు వెలుగుతున్నాయిలా..

మొత్తం వీధి దీపాలు:	5,10,413
కనెక్ట్ చేసినవి:	4,62,688
వెలగనివి:	2,13,482
వెలిగినవి:	2,49,145
వెలుగుల శాతం:	53.85

రాత్రిళ్లు భయం..భయం

- వీధి దీపాలు వెలగక రాత్రుళ్లలో పలు ప్రాంతాల్లో ప్రజలు కుక్కల బారిన పడుతున్నారు. చీకటి గా ఉండటంతో కొన్ని ప్రాంతాల్లో బహిరంగంగానే మద్యపానం చేస్తుండటంతో అటువైపు వెళ్లాలంటే ప్రజలు , ముఖ్యంగా మహిళలు భయాందోళనలకు గురవుతున్నారని రక్షాపురం, తదితర ప్రాంతాల ప్రజలు ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేశారు.
- బోరబండ, అల్లాపూర్ ప్రాంతాల్లో రోడ్ల పనుల కోసం తొలగించిన స్విచ్‌బోర్డులు తిరిగి అమర్చకపోవడంతో చీకట్లలో అల్లాడుతున్నామని స్థానికులువాపోయారు.
- ఫిర్యాదులను పరిష్కరించకుండానే.. పరిష్కరించినట్లు తప్పుడు సమాచారమిస్తున్నారని పలు ప్రాంతాల ప్రజలు పేర్కొంటున్నారు.

ఫలితమివ్వని పెనాల్టీలు

వీధిదీపాలు సరిగ్గా వెలగకపోవడంతో జీహెచ్‌ఎంసీ ఇప్పటికే దాదాపు రూ. 5 కోట్ల వరకు ఈఈఎస్‌ఎల్‌కు పెనాల్టీ విధించినట్లు తెలిసింది. నెలకుదాదాపు రూ.7కోట్లు జీహెచ్‌ఎంసీ ఈఈఎస్‌ఎల్‌కు చెల్లిస్తుండగా, అందులో నెలకు రూ. 30 లక్షలో, రూ.50 లక్షలో పెనాల్టీ విధించినా ఈఈఎస్‌ఎల్‌కు వచ్చే నష్టమేమీ లేదని, పనులు సవ్యంగా చేయనందున దానికి లాభమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కొత్తూరు: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఇంములనర్వలో చోటుచేసుకుంది. కొందరు వ్యక్తులు పేకాట ఆడుతుండగా దాడి చేసి రూ.9 వేలు స్వాధీనం చెసుకున్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

షెడ్యూలు ఆస్తి

[illegible]

తేదీ: 26-05-2023 malini.raju@jsalaw.com

ఆటస్థలంపై వివాదం.. యువకుడిపై దాడి

- కాకునూరులో ఘటన
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు





పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వివిధ పార్టీల నాయకులతో బాలమణి, (ఇన్‌సెట్‌లో) ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న భీమయ్య

కేశంపేట: ఆట స్థలం వివాదంలో ఓ దళిత యువకుడి పై పలువురు దాడి చేసిన ఘటన కేశంపేట మండల పరిధిలోని కాకునూరులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కాకునూరు గ్రామంలో బొడ్రాయి పండుగ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు మహాలింగేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని పొలం వద్ద క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే పొలం యజమానులు క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ఒప్పుకోలేదు. దీంతో గ్రామానికి చెందిన దళిత యువకుడు భీమయ్యకు పొలం యజమానులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఇది కాస్తా ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ దాడిలో భీమయ్య సొమ్మసిల్లి కిందపడిపోగా వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని కేశంపేటలో ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం భీమయ్యను షాద్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ వద్ద మాట్లాడుదామని గ్రామానికి చెందిన పలువురు తన భర్తను భీమయ్యను ఇంటి నుంచి బలవంతంగా లాక్కెళ్ళి దాడి చేశారని భార్య బాలమణి ఆరోపిస్తున్నారు. తన భర్తను హత్య చేసేందుకు గ్రామానికి చెందిన పలువురు కుట్ర పన్నారని, న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు గ్రా మానికి చెందిన జంగం మహాలింగం, బద్రీతో పాటుగా మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు.

బాధితుడిని పరామర్శించిన నేతలు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భీమయ్యను కాంగ్రెస్, బీఎస్పీ, డీఎస్పీ, ఎంఎస్పీ నాయకులు శుక్రవారం ఉదయం పరామర్శించారు. భీమయ్య పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అలుగడ్డ ప్రవీణ్‌యాదవ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు లింగం, ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ గ్యార సురేష్, దొడ్డి శ్రీనివాస్, ప్రశాంత్, కుమార్, ఇంద్రసేన, హరికుమార్, జగన్, శ్రీనివాస్, రాకేష్, రాజు, మల్లేష్, శివకుమార్, చెన్నయ్య, చిన్నోళ్ళ అనంతయ్య, పెంటనోళ్ళ నర్సింహ్మా, సురేష్, శ్రావణ్‌కుమార్‌లు ఉన్నారు.

కిలాడీ ముఠా అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు
- బ్రాస్‌లెట్, చైన్, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

నందిగామ: ఓ యువతికి మాయమాటలు చెప్పి బంగారు నగలు, నగదు తస్కరించిన కిలాడీ ముఠాను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రమైన నందిగామ పంచాయతీ అనుబంధ గ్రామం చంద్రాయన్ గూడకు చెందిన కేతినేని మాధురికి షాద్‌నగర్ పట్టణానికి చెందిన అనిల్ స్నేహితుడు. గత ఫిబ్రవరి 13న మాధురి ఫోన్‌కు నా ఆరోగ్యం బాగలేదు, కొంత నగదు పంపాలని ఒక వాట్సప్ మెసేజ్ అనిల్ నంబర్ నుంచి వచ్చింది. దీంతో మాధురి తన వద్ద డబ్బు లేదని, బంగారం చైన్ ఉందని వాట్సప్ చేయగా, నాకు అత్యవసరం ఉందని చెప్పి ఓ మహిళను పంపుతాను చైన్ ఇవ్వాలని రిప్లై వచ్చింది. దీంతో మాధురి తన వద్దనున్న 5 తులాల బంగారం చైన్‌ను తన వద్దకు వచ్చిన యువతికి ఇచ్చింది. అంతేకాకుండా లక్ష రూపాయలను విడతల వారీగా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆ యువతికి ట్రాన్స్‌ఫర్ చేసింది. కొన్ని రోజుల తర్వాత అనిల్‌కు మాధురి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. మరికొన్ని రోజుల తర్వాత అనిల్ మాధురికి ఫోన్ చేయడంతో యోగ క్షేమాలు అడగడంతో తన ఆరోగ్యం బాగానే ఉందని, నా ఫోన్ కొన్ని రోజుల క్రితమే ఎక్కడో పడిపోయిందని చెప్పాడు. బంగారం, డబ్బులు ఓ యువతికి ఇవ్వమని వాట్సప్ చేశావుగా అనిఅడుగ్గా తనకు సంబంధం లేదని అనిల్ చెప్పాడు. దీంతో మోసపోయానని గ్రహించిన మాధురి ఈ గత నెల 4న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. కేసు దర్యాప్తులో భాగంగా ఫోన్ కాల్ డేటా అధారంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా పొన్నూరు మండలం నిడుబ్రోలు గ్రామానికి చెందిన పబ్బులేటి సోనీ ప్రత్యూష అలియాస్ అమ్ములు, ఆమె భర్త పిట్టల సుధీర్ ప్రస్తుతం హైదరాబాదులోని లింగం పల్లిలో ఉంటున్నారని, వీరితో పాటు నగరంలోని ఎర్రగడ్డకు చెందిన బత్తుల భరత్ వీరు ముగ్గురు కలిసి మాధురికి మాయమాటలు చెప్పి ఫోన్ చేసి బంగారం, నగదును తీసుకున్నారని అన్నారు. వీరిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు. కాగా వీరిపై నిజామాబాద్ 3 టౌన్ పోలీస్‌స్టేషన్‌తో పాటు మరికొన్ని పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని చెప్పారు. పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నామని వివరించారు.

బ్లూ కోల్ట్స్ సిబ్బందికి సీపీ అభినందనలు

- గంట వ్యవధిలోనే చైన్ స్నాచర్‌ను పట్టుకున్నందుకు రివార్డు అందజేత



సీఐ లింగయ్యను అభినందిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్, పాల్గొన్న బ్లూ కోల్ట్స్ సిబ్బంది

యాచారం: రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ శుక్రవారం యాచారం బ్లూ కోల్ట్స్ సిబ్బందిని అభినందించారు. యాచారంలో రెండు రోజుల కిందట పెరుమాండ్ల ప్రేమలత ఇంట్లో ఉండగా ఓ ఆగంతకుడు కత్తి చూపించి, కళ్లల్లో కారం చల్లి రెండు తులాల పుస్తెల తాడును అపహరించిన విషయం విదితమే. ఈ విషయంపై సమాచారం తెలుసుకున్న బ్లూ కోల్ట్స్ సిబ్బంది కృష్ణ, సంతోష్‌లు వెంటనే స్పందించి గంట వ్యవధిలోనే నిందితుడు జోగు చైతన్యగా గుర్తించి పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన సీఐ లింగయ్య జోగు చైతన్యను గురువారం రిమాండ్‌కు పంపించారు. ఇదే విషయమై సమాచారం తెలుసుకున్న రాచకొండ సీపీ శుక్రవారం ఎల్బీ నగర్ క్యాంపు కార్యాలయంలో బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ కృష్ణ, హోంగార్డు సంతోష్‌కుమార్‌లకు రూ.వెయ్యి చొప్పున నగదు రివార్డును అందజేసి అభినందించారు. కేసు నమో దు చేసి తక్షణమే రిమాండ్‌కు పంపించినందుకు సీఐ లింగయ్యను కూడా సీపీ అభినందించారు. నేరాల పట్ల తక్షణమే స్పందిస్తే పోలీసుల పట్ల ప్రజల్లో మరింత గౌరవం పెరుగుతుందని సీపీ అన్నారు.

అప్పుల బాధ భరించలేక..

- వ్యక్తి ఆత్మహత్య

శంకర్‌పల్లి: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని ఒంగోలు జిల్లాకు చెందిన కె. శ్రీనివాస్(45) ఎనిమిదేళ్లుగా శంకర్‌పల్లిలో మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నారు. అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని సుదర్శన్ వద్ద రూ. ఆరు లక్షల వరకు అప్పు తీసుకున్నారు. ఇటీవల కాలంలో సుదర్శన్‌కు 3లక్షల, 25వేలు చెల్లించారు. మిగతా రూ.2లక్షల 75వేల కోసం గురువారం గొడవకు దిగాడని తెలిపారు. దీంతో మనస్తాపం చెంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి భార్య అంజిలమ్మ, కుమారులు సాయి, పండు ఉన్నారు. ఈ మేరకు భార్య పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

ఘట్టుపల్లి చెరువులో మృతదేహం

మహేశ్వరం: ఘట్టుపల్లిలోని చెరువులో గుర్తు తెలియని మృతదేహం శుక్రవారం లభ్యమైంది. చెరువులో మృతదేహం తెలియాడుతుండటంతో స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం వివరాలు తెలియాల్సి ఉంది. మూడు రోజుల క్రితం చెరువులో పడినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. మృతుడి ఎత్తు 5.5, గోధుమ కలర్ ఫుల్ షర్ట్, యాష్ కలర్ నైట్ పాయింట్ ధరించి ఉన్నాడు. వయస్సు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.